# ప్రతిధ్వని

'అమ్మా! అమ్మా!!'

ఆ రెండు మాటలు రఘురాం కూర్చున్న విక్టోరియా పార్కునేకాదు - అంతులేని అశాంతితో కాళ్లో చుట్టి వచ్చిన బట్టర్‌ఫ్లై హౌస్, స్నేక్ స్ట్రీట్, బౌద్ధాలయం, కాజ్వేలనే కాదు - తానుంటున్న హాంకాంగ్‌నే కాదు - భూతలాన్నే దద్దరిల్లచేసేవి.

కాని, అవి గుండె గొంతుకలోనే నినదిస్తూ అతణ్ణి అతలాకుతలం చేస్తున్నాయి. ఆలోచనలు అలలెత్తుతున్నాయి- పెనుతుఫాను తాకిన సాగరంలోలా. ఘనీభవించి మనస్సును కమ్మిన కాఠిన్యం ద్రవించసాగింది. మమతలకు మసిపూసి జాడ తెలియకుండా చేసిన అహంకార మేఘాల పొరలు విచ్చుకుంటున్నాయి.

ఊర్నుంచి బ్యాంకు మేనేజరు అన్ని వివరాల్తో రాసిన ఉత్తరం రఘురాం చేతిలో వుంది. అతని చూపులు ఆ క్షణాన హాంకాంగ్ నగర విచిత్ర శోభల తెరలు చీల్చుకుని వేల మైళ్ల దూరంలో వున్న నిమ్మలూరు చెరువు గట్టున పూరిల్లు చూడగలుగుతున్నాయి.

అది తన వూరు. ఓనమాలు దిద్దుకున్న బడి ఆ వూళ్ళోనే వుంది. దూరాన విజయవాడ కొండలు చూపించి ఆశ్చర్యపరచిన పొలిమేరలు ఆ వూరివే.

పెళ్ళైన చాలాకాలం వరకు సంతానం కలగలేదని అల్లాడిపోయి తీర్థయాత్రలు జరిపి, పూజలు చేసి, మొక్కులు మొక్కి, కడుపు పంటగా తనను కన్నందుకు జన్మ తరించిందని పరవశించిన పురుషోత్తం, వర్ధనమ్మ దంపతులు స్థిరపడింది ఆ వూళ్ళోనే. రాముడే తన గర్భాన జన్మించాడని నమ్మి కొడుక్కి 'రఘురాం' అని పేరు పెట్టుకున్న ఉత్తమ ఇల్లాలు వర్ధనమ్మ. కొడుక్కి ఏ లోటు రానీయకుండా పెద్ద చదువులు చెప్పించి, వూరికి పేరు ప్రఖ్యాతులు ఆర్జించే గొప్ప ఇంజనీరుగా తీర్చి దిద్దడంకోసమే భగవంతుడు తనసీ లోకంలో పుట్టించాడని విశ్వసించిన తండ్రి పురుషోత్తం.

చేసింది కోర్టు గుమాస్తా వుద్యోగమే. కాని సంపాదించుకున్న గౌరవమర్యాదలు సాటిలేనివి. కొడుకును మంచి స్కూల్లో చదివించాలని జిల్లా జడ్జిని అర్థించి అలాంటి చోట్లే పోస్టింగు వేయించుకునేవాడు. ముందుగా కొడుకు పుస్తకాలన్నీ క్షుణ్ణంగా చదివి చీకటి పడగానే ఆ పాఠాలన్నీ తానే వుపాధ్యాయుడై నూరిపోసేవాడు. అందుకే రఘురాం చదువుల్లో ప్రథముడుగా నిలిచేవాడు. పురుషోత్తం సాధన కొడుకు

ఇంటర్మీడియట్ కాలేజీ ఫస్ట్ వచ్చేవరకు అవిశ్రాంతంగా సాగింది. అది తపస్సు ఫలించిన తరుణం. కలలు నిజమవుతున్న శుభసమయం. తండ్రి ఆనందానికి అవధులు లేవు. కాలేజీ ప్రిన్సిపాల్ అభినందిస్తూ వుత్తరం రాశాడు. రఘురాం పైచదువు గురించి అడిగాడాయన. వాల్తేరులో ఇంజనీరింగు చదివించదలిచానని జవాబు పంపాడు. ఈ సంకల్పాన్ని బలపరుస్తూ ప్రిన్సిపాల్ సమాధానం రాశాడు.

ఆ తల్లితండ్రులకదొక యజ్ఞం. దీక్షతో సాగింది. రఘురాం ఉజ్జ్వల భవిష్యత్తు వారి లక్ష్యం. ఆ కుటుంబం పైన దేవుడి చల్లని చూపులు వున్నాయి. రఘురాం ప్రతిభ మరోసారి రుజువయింది. అగ్రశ్రేణిలో బి.ఇ. ప్యాసయ్యాడు. స్వర్ణపతకం అందుకున్నాడు. నిమ్మలూరు పండుగ చేసుకుంది.

ఒక రోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక రఘురాం తన భవిష్యత్తు గురించి తండ్రితో ప్రస్తావిస్తూ గద్గదికంతో 'మీరూ, అమ్మా నా కోసం యిన్నేళ్ళుగా ఎంత త్యాగం చేశారో తెలుసు నాన్నా! మీరింక కష్టాలు పడడం ఎందుకు? ఎక్కడైనా వుద్యోగం సంపాదిస్తా నాన్నా!' అన్నాడు జలజలాకారుతున్న కన్నీరు తుడుచుకుంటూ.

కొడుకు భుజం మీద లాలనగా చేయివేసి 'నాయనా! మేం చేసింది ఏముందయ్యా! భగవంతుడి దయ. మా ధర్మం మేం చేస్తున్నాం. ఎవరి కోసమో కాదే... మా బిడ్డ కోసం, మా సంతోషం కోసం' అన్నాడాయన. కొడుకు మనస్సులోని కృతజ్ఞతకు తల్లిదండ్రులు సంబరపడిపోయారు.

ఒక్క క్షణం ఆగి 'నాయనా! ఇదివరకే మా జడ్జిగారి సలహా తీసుకున్నాను. వాళ్ళబ్బాయి పిలానీలో చదువుతున్నాడు. నీకు ఎం.ఇ.లో సీటుకోసం అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఫారాలు వచ్చాయి. రేపు మంచిరోజు. పంపుదాం. నువ్వు ఎం.ఇ. చేయాలని నా కోరిక.'

తండ్రి మాటే ఆదేశం అయింది.

పిలానీలో కూడా తన స్థాయిని నిలుపుకున్నాడు. మళ్ళీ స్వర్ణపతకం అతణ్ణే వరించింది. తల్లిదండ్రుల సంతోషానికి ఎల్లలు లేవు.

ఢిల్లీలో వున్న పెద్ద పారిశ్రామిక సంస్థ మంచి జీతంలో జాబ్ ఆఫర్ చేసింది. తల్లిదండ్రుల ఆశీర్వాదం పొంది దేశరాజధాని చేరుకున్నాడు.

రెండు నెలలు ఇంటికి వారం వారం వివరంగా వుత్తరాలు రాసేవాడు. తర్వాత ఢిల్లీ అతనికి కొత్త చూపునిచ్చింది. కొత్త వూహలు పంచింది. వింత విలువలు నేర్పింది. మనస్సును మలినం చేసింది. సెంటిమెంట్లు, మమతానురాగాలు, బాంధవ్య బంధాలు ఛాందసంగా తోచసాగాయి. మిత్రులతో వినోదాలు, కాలక్షేపాలు కొత్త అనుభూతుల్ని ఇచ్చాయి. తన వూరు, తన కుదురూ చెప్పుకోవడం చిన్నతనంగా తోచింది. పరిసరాల ప్రభావం అతనిపైన అంత బలీయంగా వుంది.

సెంట్రల్ సెక్రటేరియట్‌లో కార్యదర్శిగా వున్న ముఖర్జీ కుటుంబంతో పరిచయం అతనిలో అనూహ్యమైన పరివర్తన తెచ్చింది.

అప్పుడే తండ్రి దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. పెళ్ళి సంబంధాలు చూస్తున్నామనీ ముందుగా వచ్చే తేదీ రాస్తే పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తామనీ ఆయన సూచించాడు.

దానికి ముక్తసరిగా ఇంగ్లీషులో సమాధానం వచ్చింది. పాతకాలపు పద్ధతుల్నీ చాదస్తాల్నీ తనమీద రుద్ది తన జీవితాన్ని నిరాశల పాలు చేయవద్దని దాని సారాంశం. తండ్రి ఖిన్నుడయ్యాడు. తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు. రాసింది నిజంగా తన కొడుకేనా అనే సంశయం కూడా వచ్చింది. కాని అదే దస్తూరి. భాష వేరు. భావం వేరు - అంతే తేడా.

తల్లి వర్ధనమ్మ కొడుకు రాసిన మాటలే చదువుకోవాలని వువ్విళ్లూరుతుంది. పనుల ఒత్తిడివల్ల ఇంగ్లీషులో రాశాడని సర్దిచెప్పాడు తండ్రి. తమ ఆరోగ్యం గురించి అడిగినట్లు చెప్పాడు. ఆమె మురిసిపోయింది.

ఆ రోజు సాయంత్రం కాలువగట్టు వెంట ఒంటరిగా నడుస్తూ ఎవరూ చూడకుండా ఆయన కంట తడిపెట్టుకున్నాడు.

కళ్ళు చెమర్చడం ఆగకముందే మరో వుత్తరం వచ్చింది. ముఖర్జీ అనే పెద్ద బెంగాలీ ఆఫీసరు కుమార్తెను ఢిల్లీలోనే పెళ్ళిచేసుకున్నట్టూ హాంకాంగ్‌లో అంతర్జాతీయ సంస్థలో ఉన్నతోద్యోగం వచ్చినట్టూ త్వరలో అక్కడికి వెళ్తున్నట్టు రాశాడు రఘురాం.

బరువునంతా తన గుండెపైనే పేర్చుకుని ఆ తండ్రి కొడుకు రాసిన వుత్తరం సారాన్ని తల్లికి హృద్యంగా వుండేట్టు వినిపించాడు. ఆమె తెలుగులో కొడుక్కి వుత్తరం రాస్తూ తన ఆనందాన్నీ ఆశీస్సులనూ వర్షించింది. కొడుక్కి నచ్చిన అమ్మాయే సీతమ్మ తల్లి అని పొంగిపోయింది. తాను కూడా దీవెనలు తెలుపుతూ తండ్రి వుత్తరం రాశాడు.

అత్తగారు తెలుగులో వుత్తరం రాయడం అనాగరికంగా తోచింది కొత్త కోడలికి. కాని, వివరించి సంగతులు చెప్పాక ఆమె మొహం విప్పారింది.

కొత్త జంట హాంకాంగ్ చేరుకుంది.

కలలో కూడా కొడుకు తన బరువు బాధ్యతలు మోయాలని తండ్రి ఆపేక్షించలేదు. కొడుకు ఆనందాన్నే కోరుకున్నాడు. అలాంటిది నిష్ఠురంగా కొడుకు వుత్తరం రాయడం తండ్రిని నిలువునా కుంగతీసింది. పదవీ విరమణ కూడా అయింది.

కొడుకు వైనంలో వచ్చిన మార్పు తల్లికి తెలియకుండా జాగ్రత్తపడ్డాడాయన. దిగులు పీల్చి పిప్పిచేసింది. నిడుమోలులో వున్న బ్యాంకు మేనేజర్ని పిలిపించి కుటుంబ పింఛను గురించి చెప్పి సహాయం చేయమని అర్థించాడు. అశుభంగా ఎంచి ఆ ప్రస్తావన ఆపుచేయమని కోరింది భార్య అయినా వినలేదు.

'రఘురాం!' అంటూ కన్నుమూశాడాయన. ఆ వార్త చేరేనాటికి హాలీడేకి

రఘురాం కుటుంబంతో పెనాంగ్ వెళ్ళాడు. తిరిగి వచ్చాక సంగతి తెలుసుకున్నాడు. పొడి పొడి మాటలతో సంతాప సందేశం మాదిరి తల్లికి వుత్తరం రాశాడు. వచ్చి చూస్తానన్న మాటే లేదు-

రఘురాం వుత్తరం మళ్ళీ చదువుదామని మడత విప్పాడు. అప్పటికే నీళ్ళు నిండడం వల్ల కళ్ళకు అక్షరాలు కనిపించలేదు. జేబు రుమాలు తీసి తుడుచుకున్నాడు. అటూ యిటూ చూశాడు ఎవరైనా గమనిస్తున్నారేమోనని. మళ్ళీ ఆలోచన్లు ముసురుకున్నాయి. గతం కళ్ళముందు నిలిచింది-

ఎక్కడో పెద్ద వుద్యోగంలో వుండడం చేత రాలేకపోయాడని తల్లి అనుకుంది. అతని బాధను కూడా తానే వహించింది.

తర్వాత ఎప్పుడో ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ మహాసభకు వచ్చి భార్యనీ కొడుకునూ ఢిల్లీలో దిగవిడిచి చుట్టపు చూపుగా నిమ్మలూరు వచ్చి మర్నాడే వెళ్ళిపోయాడు. వచ్చి వెళ్ళిన సంగతి వూళ్ళో చాలామందికి తెలియదు.

ఎంతోకాలానికి కొడుకును చూసినందుకు తల్లి మనస్సు సంతోషంతో తరగలెత్తింది. గొప్ప పదవిలో వుంటే అలా వుండాలేమోనని విస్తుపోయింది.

కాలచక్రం ఆగదు. కొడుకు వైఖరి మారలేదు. హాంకాంగ్ నుంచి ఉత్తరాలు రావడం లేదు. ఎవరి ద్వారానో తెలిసింది రఘురాంకి కొడుకూ ఆ తర్వాత కూతురూ పుట్టారని. మనవణ్ణీ, మనవరాల్నీ చూడాలని ఆమె కళ్ళు కాయలు కాస్తున్నాయి.

కాని అది తీరడం సాధ్యమేనా అని ఆమె విచారం.

ఇలా వుండగా బ్యాంకు మేనేజరు ఒక శుభవర్తమానం తెచ్చాడు. విజయవాడ సబ్‌కలెక్టరు ముఖర్జీ కొడుకట. ఆయన విజయవాడలో పెద్ద పారిశ్రామికవేత్త కుమార్తెను పెళ్ళి చేసుకుంటున్నాడట. ఆ వివాహానికి ఢిల్లీ నుంచి ముఖర్జీ కుటుంబం, హాంకాంగ్ నుంచి కొడుకూ, కోడలూ పిల్లల్ని తీసుకుని వస్తారట!

ఆమె హృదయం ఆనందార్ణవంగా మారింది. ఇంటిని బాగుచేయించి, సున్నాలు వేయించింది. కిటికీలకూ ద్వారాలకూ అందమైన కర్టెన్లు కుట్టించింది. వంట దినుసులు కొని భద్రపరచింది. పెళ్ళికి ముందొస్తారో తర్వాత వస్తారో తెలియదు. అయినా ఆమె ప్రతి క్షణం నిరీక్షిస్తూనే వుంది.

పెళ్ళి తేదీ దాటింది. మరో రెండు రోజులు గడిచాయి. ఎవ్వరూరాలేదు. ఎంత లోలోన అణచుకున్నా ఆవేదన ఆగలేదు. సంగతి తెలుసుకోమని బ్యాంకు మేనేజరుకు కబురు పెట్టింది. మర్నాడు ఆయనే స్వయంగా వచ్చాడు. గుండె చెక్కలయ్యే వార్త మోసుకొచ్చాడు- పెళ్లివారంతా ఢిల్లీకి తిరిగి వెళ్లిపోయారని!

ఆమె కుప్పకూలిపోయింది. భూమి విచ్చుకుని తనను పాతాళంలోకి లాక్కుపోయినట్లనిపించింది ఆమెకు. చేతనైనంతగా బ్యాంకు మేనేజరు ఆమెను ఓదార్చాడు. మరో దేశం నుంచి వచ్చిన కొడుకు తన వూరూ, తనను కన్నతల్లి వుండే యింటికీ వచ్చి చూడకుండా ఎలా వెళ్లగలిగాడు? ఆమె ఆలోచనలకు అందని ప్రశ్న అది!

ఇంక అక్కడ ఎవరికోసం ఎదురుచూడాలి? ఇది ఆమె వేసుకున్న ప్రశ్న. జవాబు తానే వెతుక్కుంది. ఆ జవాబులోనే మనశ్శాంతి పొందే మార్గం కనిపించి వుంటుంది-

రఘురాం వుత్తరం చివరి భాగం చదివే ప్రయత్నం చేశాడు.

'మీ అమ్మగారి స్థితి వర్ణించలేను. ఆమెకు సర్వస్వం మీరే! మీరు రానందుకు ఆమె గుండె వేయి ముక్కలయింది. కాని పైకి ఒక్కమాట కూడా అనని సంస్కారం ఆమెది. మనస్సుకు వూరట వెతుక్కుంటూ హృషీకేశం వెళ్ళిపోయారు. ఫ్యామిలీ పెన్షన్లో నుంచి నెలకు రెండొందలు పంపమన్నారు. మిగిలిన పైకం నెల నెలా మీ పేర అక్కౌంట్లో జమ అవుతుంది. ఆ కాగితాలు జతపరుస్తున్నాను. ఇల్లు అద్దెకిచ్చారు. ఆ మొత్తం కూడా మీ పేర జమ అవుతుంది. కుడిచేతి మీద 'రఘురాం' అని పచ్చబొట్టు వేయించుకున్నారు. ఆ రాముడే తన కడుపున జన్మించాడని నమ్మే తల్లి! చివరి క్షణం వరకు 'రఘురాం' అంటూ వుంటానని, ఆ మాట తన నోటి నుంచి రావడం ఆగి పోయి భర్త సన్నిధి చేరుకున్న సంగతి ఏ పుణ్యాత్ముడైనా రాస్తాడని ఆమె చెప్పారు.....'

రఘురాంకి తర్వాత అక్షరాలు కన్పించలేదు. కన్నీటితో తడిసిపోయాయి.

'అమ్మా! అమ్మా!! నన్ను క్షమించు. వెంటనే వచ్చి ఎక్కడున్నా వెతికి, నా కన్నీటితో నీ పాదాలు కడిగితేగాని శాంతిలేదు. వస్తున్నానమ్మా!' అని నిశ్చయించుకుని విక్టోరియా పార్కు నుంచి ఇంటివైపు కారు పోనిచ్చాడు.

ఏ దివ్యశక్తో ప్రేరేపించినట్లు దేవప్రయాగవైపు సాగిపోతున్న వర్ధనమ్మ మాతృ హృదయంలో ఈ మాటలు ప్రతిధ్వనించాయన్నట్టు ఈ లోకంనుంచి వెళ్ళేముందు తన రఘురాం తప్పక ఎక్కడో కనిపిస్తాడన్న ఆశ చిగిర్చి ఎండిన ఆమె పెదాలపై లీలగా చిరునవ్వు చెంగలించింది.

*(ఆంధ్రసచిత్రవారపత్రిక - 7-12-'90)*